శృంగవృక్షం - వేండ్ర రహదారిని నిర్మించాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - పాలకోడేరు

శృంగవృక్షం నుంచి వేండ్ర వెళ్లే రహదారిని తక్షణం నిర్మించాలని సిపిఎం మండల కార్యదర్శి శేషాపు అశ్రియ డిమాండ్ చేశారు. స్థానిక రహదారిలో సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అశ్రియ మాట్లాడారు. 30 ఏళ్ల నుంచి రహదారి నిర్మాణానికి నోచుకోలేకున్నారు. ఎంతోమంది ప్రయాణికులకు, రైతులకు అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. కేవలం రహదారికి అరకొరగా మరమ్మతులు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. లక్షల రూపాయలు అక్రమంగా బిల్లులు చేసుకుంటున్నారు తప్ప రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవట్లేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు తాడి రామారావు, ఏసు, కడలి అప్పారావు, మరియమ్మ పాల్గొన్నారు.

ఇసుక రాదాయే..!

చేబ్రోల్ ఇసుక స్టాక్ పాయింట్ వద్ద పరిస్థితి ఇది

- స్టాక్ పాయింట్ల నుంచి సరఫరా నిల్
- చేబ్రోలు స్టాక్ పాయింట్ వల్ల ప్రయోజనం శూన్యం
- రెండు జిల్లాల్లోనూ ప్రజలకు తప్పని కష్టాలు
- ఎక్కడికక్కడ నిలిచిన నిర్మాణ పనులు
- మళ్లీ పెరిగిన ఇసుక దళారీల దందా
- ఆరు యూనిట్ల ధర రూ.22 వేలకు విక్రయం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఇసుక కోసం రెండు జిల్లాల ప్రజానీకం పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక పాలసీ మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలు లేకపోవడంతో ఇసుక కోసం నానాతంటాలు పడాల్సి వస్తోంది. ఇదే అదునుగా ప్రయివేటు ఇసుక దందా పెరిగిపోయింది. దీంతో గతంలో మాదిరే రూ.నాలుగైదు వేలు ధర ఎక్కువ చెల్లిస్తే తప్ప ఇసుక దొరికే పరిస్థితి లేకుండాపోయింది. జులై ఎనిమిదో తేదీన ఉచిత ఇసుక పాలసీని ప్రభుత్వం ప్రకటించింది. ఇసుక స్టాక్ పాయింట్లలోని ఇసుక విక్రయాలకు ధర నిర్ణయించింది. ఏలూరు జిల్లాకు ఉంగుటూరు మండలంలోని చేబ్రోలు ఇసుక పాయింట్ వద్ద టన్ను ఇసుక ధర రూ.538గా నిర్ణయించింది. ఇప్పటి వరకూ ఈ స్టాక్ పాయింట్ నుంచి ఇసుక విక్రయించిన పరిస్థితి లేకుండాపోయింది. ఈ స్టాక్ పాయింట్లో ఇసుక నిల్వలు లేవు. దీంతో ఈ స్టాక్ పాయింట్ ఎందుకని జనం ప్రశ్నిస్తున్నారు. కుక్కునూరు మండలం వింజరం, ఇబ్రహీంపేటలో ఇసుక మూడు స్టాక్ పాయింట్లు నుంచి ఇసుక విక్రయాలు ప్రారంభించారు. అక్కడ నుంచి సైతం ఇసుక సరఫరా సరిగా జరగడం లేదు. వరదలు రావడంతో పరిస్థితి మరింత అధ్వానంగా మారిపోయింది. చేబ్రోలు, ఏలూరుకు కుక్కునూరు మండలం వంద కిలోమీటర్లకుపైగా దూరం ఉంది. అక్కడ నుంచి ఇసుక తీసుకురావాలంటే రవాణా ఛార్జీలు తడిసి మోపెడవుతాయి. ఈ పాయింట్లలో ఇసుక జిల్లా ప్రజలకు పెద్దగా ఉపయోగపడని పరిస్థితి ఉంది. వింజరం, ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్లలో ఇసుక ఎక్కువగా తెలంగాణకు తరలిపోతుంది. దీంతో ఏలూరు జిల్లా ప్రజానీకం ఇసుక దొరక్క నానావస్థలు పడుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోనూ అదే పరిస్థితి నెలకొంది. ఈ జిల్లాలో ఆచంట మండలం కోడేరు, కరుగోరుమిల్లి, పెనుగొండ మండలం సిద్ధాంతంలో రెండు, నడిపూడిలో రెండు మొత్తం ఆరు ఇసుక ర్యాంపులు ఉన్నప్పటికీ ప్రస్తుతం మూతపడి ఉన్నాయి. యలమంచిలి, నరసాపురంలో ఐదు డీసిల్టేషన్ పాయింట్లు ఉన్నప్పటికీ అక్కడ ఇసుక లేదు. తూర్పుగోదావరి జిల్లాలోని నిడదవోలు మండలం పందలపర్రు, పెరవలి మండలంలోని పెండ్యాల, ఉసులమర్రులో ఇసుక అందుబాటులో ఉందని ప్రకటించినా ఇసుక సరఫరా లేదని జనం చెబుతున్నారు. దీంతో ఇసుక ఎక్కడ నుంచి తెచ్చుకోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. వరద వెళ్లే వరకూ స్టాక్పాయింట్లలో ఇసుక సరిపోతుందని నిన్నటి వరకూ చెప్పుకొచ్చారు. ఇప్పుడు ఏ స్టాక్ పాయింట్ నుంచి ఇసుక సరఫరా సక్రమంగా లేని పరిస్థితి నెలకొంది.

బ్లాక్లో కొనుగోలు చేస్తేనే ఇసుక

ఇసుక దొరక్క జిల్లాలో కొనసాగుతున్న నిర్మాణాలు చాలా వరకూ నిలిచిపోయాయి. ఇసుక కోసం నానా తంటాలు పడుతున్నా దొరకడం లేదు. బ్లాక్లో మాత్రం యథేచ్ఛగా దొరుకుతున్న పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో ఆరు యూనిట్ల ఇసుక రూ.18 వేలకు దొరకగా, ఇప్పుడు బ్లాక్లో అదే ఆరు యూనిట్ల ఇసుక రూ.22 వేలకు విక్రయిస్తున్న పరిస్థితి ఉంది. ఉచిత ఇసుక అంటూ ప్రచారం చేసి ఇసుక దొరకకుండా చేస్తారా అంటూ జనంలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిర్మాణాలు ఆగిపోవడంతో కొంతమంది గత్యంతరం లేని పరిస్థితుల్లో బ్లాక్లో ఇసుక కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. బ్లాక్లో సాగుతున్న ఇసుక దందాను కట్టడి చేసి, ఇసుక అందించాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ వివిధ శాఖల అధికారుల మధ్య సమన్వయం కొరవడినట్లు తెలుస్తోంది. ఇసుక ఎప్పుడు సరఫరా చేస్తారని రెండు జిల్లాల ప్రజానీకం ప్రశ్నిస్తున్నా సమాధానం చెప్పేవారే లేకుండా పోయారు. ఇసుక సరఫరా లేకపోవడంతో పనులు నిలిచిపోయి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండాపోయింది. ఇసుక సరఫరాపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

ఇసుక లేక ఇంటి పని ఆగిపోయింది..

పి.వెంకటేశ్వరరావు, నిడమర్రు మండలం

ఇంటి నిర్మాణం చివరి దశకు చేరుకుంది. పది రోజులుగా ఇసుక కోసం ప్రయత్నిస్తున్నా దొరకడం లేదు. దీంతో నిర్మాణ పనులు ఆపేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉచిత ఇసుక అన్నారని ఎంతో సంతోషించాం. అసలు ఇసుకే అందకుండాపోయింది. బ్లాక్ మార్కెట్లో ఆరు యూనిట్ల ఇసుక రూ.22 వేల వరకూ చెబుతున్నారు. అంత సొమ్ము చెల్లించి కొనుగోలు చేయలేక ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. చేబ్రోలు స్టాక్ పాయింట్లో ఇసుక అందుబాటులోకి తెస్తే ఇబ్బంది తొలుగుతుంది.

శాంతించిన వరద గోదావరి

లంకలను వీడని వరద

ప్రజాశక్తి - ఆచంట

వరద గోదావరి మంగళవారం కాస్త శాంతించింది. పెదమల్లం, కోడేరు పుష్కర ఘాట్ల వద్ద మూడు అడుగుల మేర నీటిమట్టం తగ్గింది. గోదావరి తగ్గుముఖం పట్టడంతో అధికారులతోపాటు లంక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కరుగోరుమిల్లి పుష్కర ఘాట్ ఇంకా ముంపులోనే ఉంది. స్పెషలాఫీసర్ పిచ్చయ్య, తహశీల్దార్ ఐవి.శెట్టి, ఎంపిడిఒ నరసింహప్రసాద్ వరద సహాయక చర్యలు పర్యవేక్షించారు. గోదావరి ఉధృతి ఇంకా కొనసాగుతుండటంతో లంక గ్రామాల మధ్య పడవ ప్రయాణాలకు అధికారులు అనుమతులు ఇవ్వలేదు. లంక ప్రాంతాల నుంచి రైతులు కొబ్బరికాయలను ఇంజన్ పడవలపై ఒడ్డుకి చేరవేస్తున్నారు. లంక గ్రామాల్లోని వల్లప్ప ప్రాంతాల్లో కూరగాయల రైతులు మాత్రం తీవ్రంగా నష్టపోయారు. ఎస్ఐ రాజ్కుమార్ ఆధ్వర్యంలో పుష్కర ఘాట్ల వద్ద పోలీసు బందోబస్తు కొనసాగుతుంది.

ఆచంట : కరుగోరుమిల్లి పడవపై తీసుకొచ్చిన కొబ్బరి కాయలను దించుతున్న కార్మికులు

యలమంచిలి: గోదావరి వరద మంగళవారం కొంతమేర శాంతించినప్పటికీ ఇంకా లంక గ్రామాలు మాత్రం జలదిగ్బంధంలోనే ఉన్నాయి. దీంతో కనకాయలంక, బాడవ, పెదలంక, యలమంచిలి లంక, లక్ష్మీపాలెం, అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల పల్లిపాలెం తదితర గ్రామాల్లోని ప్రజలు తమ రాకపోకలకు నాటు పడవలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఆయా లంక గ్రామాల్లో వరద బాధితులు నిత్యావసరాల కోసం స్థానిక రేషన్ దుకాణానికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు పడవలపై నిత్యావసర సరుకులను ఇంటింటికీ అందిస్తే ఎటువంటి ఇబ్బందీ ఉండదన్నారు. సుమారు కిలోమీటరు దూరం నడుము లోతు నీటిలో నడిచి వెళ్లి సరుకులు తెచ్చుకునే క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యలమంచిలి:కనకాయలంకలో వరద నీటిలోనే ఇళ్లు

పశువులకు దాణా పంపిణీ

కనకాయలంక, పెదలంక గ్రామాల్లో మంగళవారం స్థానిక పాడి రైతులు సుమారు 150 మందికి 25 కిలోల చొప్పున మినరల్ మిక్చర్ దాణా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కనకాయలంక సర్పంచి మద్దా శ్రీనివాసరావు, పెదలంక సర్పంచి తాళ్ల నాగరాజు, టిడిపి గ్రామ నాయకులు ముస్కూరి రాంబాబు పాల్గొన్నారు.

నట్టేట ముంచిన నక్కల డ్రెయిన్..!

ప్రజాశక్తి - ఆచంట

రెండు వారాల వ్యవధిలో మరోమారు నక్కల డ్రెయిన్ పొంగడంతో మండలంలోని ఆచంట, పెనుమంచిలి, కొడమంచిలి, కోడేరు, కరుగోరుమిల్లి, వల్లూరు, ఆచంట వేమవరం గ్రామాల్లోని పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. కొద్దిరోజుల క్రితం ఇదే డ్రెయిన్ పొంగి పొలాలు నీట మునగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయిన సంగతి తెలిసిందే. గోదావరి వరద నిలకడగా ఉన్నప్పటికీ వడ్డిలంక స్లూయిస్ గేట్లు సక్రమంగా పని చేయకపోవడంతో గోదావరి నీరు నక్కల కాల్వలోకి చేరుతోంది. దీంతో నక్కల డ్రెయిన్ ఉప్పొంగి సుమారు 1300 ఎకరాల్లో వరి చేలు నీట మునిగాయి. వీటిలో పది రోజులు కిందట కొత్తగా నాట్లు వేసిన పొలాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. సార్వా సాగు తొలిదశలోనే నాట్లు వేసేందుకు రెండుసార్లు అప్పు చేసి మరీ పెట్టుబడులు పెట్టినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నక్కల, కొఠాలపర్రు డ్రెయిన్లను ఆనుకుని ఉన్న పొలాలు, తాడేరు వంతెన సమీపంలోని రహదారికి ఇరువైపులా ఉన్న పొలాల్లో సుమారు నాలుగు అడుగుల మేర నీరు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వరినాట్లు కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన తూడు, చెత్త నక్కల, కొఠాలపర్రు, తాడేరు డ్రెయిన్లలో పేరుకుపోవడంతో దిగువకు నీరు లాగే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో ముంపు తీవ్రత పెరిగిందని, గోదావరిలో నీరు తగ్గితేగాని పొలాలు ముంపు నుంచి బయటపడబోమని రైతులు వాపోతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి నక్కల, తాడేరు, కొఠాలపర్రు డ్రెయిన్లలో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క, చెత్తాచెదారాన్ని తొలగించాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

పాలస్తీనాకు అందరం అండగా నిలబడదాం


సదస్సుకు హాజరైన జనం

ఇజ్రాయిల్ దుర్మార్గాన్ని ఖండించండి
పాలస్తీనా సంఘీభావ వేదిక సదస్సు పిలుపు
పశ్చిమ ఆసియాపై అమెరికా పెత్తనమే యుద్ధం ముఖ్యోద్దేశం
ప్రముఖ పాత్రికేయులు గడ్డన్న

ప్రజాశక్తి - భీమవరం

గత 295 రోజులుగా మారణ హోమం సృష్టిస్తున్న ఇజ్రాయిల్ దుర్మార్గపు దాడి, నరమేధం ఆపడంతోపాటు దుర్మార్గపు చర్యలను ఖండించి పాలస్తీనాకు అందరం అండగా నిలబడదామని పాలస్తీనా సంఘీభావ వేదిక సదస్సు పిలుపునిచ్చింది. అమెరికా కుట్రలు, ఇజ్రాయిల్ దురాక్రమణ నుండి పాలస్తీనాను విముక్తి చేయడంతోపాటు భారత ప్రభుత్వ నిర్ణయం మార్చుకోవాలని ముక్తకంఠంతో సదస్సు నినదించింది. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో పాలస్తీనా సంఘీభావ వేదిక సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సుకు సంఘీభావ సదస్సు వేదిక నాయకులు బి.బలరాం అధ్యక్షత వహించారు. ముఖ్యవక్త ప్రముఖ పాత్రికేయులు కె.గడ్డన్న మాట్లాడుతూ 2023 అక్టోబర్ నుంచి పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి చేస్తుందని, ఆసుపత్రులు, శరణార్థ శిబిరాలు, ప్రజలు నివశిస్తున్న ప్రాంతాలపైనా దాడులు చేస్తున్నారని, దీన్ని ప్రతిఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందని అన్నారు. దీనికి అమెరికా పశ్చిమ ఆసియాపై తన గుత్తాధిపత్యాన్ని కాపాడుకోవడానికి, తన ఆయుధాలను అమ్ముకోవడానికి పరోక్షంగా ప్రపంచంపై పెత్తనాన్ని కొనసాగించడానికి చేస్తున్న ప్రయత్నంలో భాగమేనని అన్నారు. దీనివల్ల ప్రపంచం అశాంతికి గురవుతుందని, వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గాజాలో ప్రజల ఆయువు కేవలం 18 సంవత్సరాలు అని చెప్పారు. ఎక్కువ మంది చిన్నారులు, మహిళలు చనిపోవడమే దీనికి నిదర్శనమన్నారు. ఏడాది పాటు జరిగిన యుద్ధంలో ఇప్పటివరకు లక్షా 86 వేల మంది చనిపోయినట్లు బ్రిటన్కు సంబంధించిన ఒక పత్రిక వెల్లడించిందని చెప్పారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక అలీన విదేశాంగ విధానానికి తిలోదకాలు ఇచ్చిందని అన్నారు. గత చరిత్రలో మహాత్మాగాంధీ వంటి వారు పాలస్తీనా ఒక స్వతంత్ర దేశంగా ఉండాలని కోరుకున్నారని గుర్తు చేశారు. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబియా, సిరియా, ఉక్రెయిన్, గాజా యుద్ధాలకు అమెరికా కారణమన్నారు. 2007లో ఏర్పడిన ఆర్థిక మాంద్యం నుంచి బయటపడేందుకు ఉద్రిక్తతలు, మతాల మధ్య చిచ్చు, దేశ ఐక్యతను దెబ్బతీసేలా వ్యవహరిస్తుందని విమర్శించారు. వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు నిరంతరం ఈ విధానాలను ఎండగడుతూ విశేష కృషి చేస్తున్నాయన్నారు. భవిష్యత్తులో సంఘీభావ సదస్సులు, ర్యాలీలు, ఉద్యమాలు పెద్ద ఎత్తున చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సదస్సులో ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు చైతన్య ప్రసాద్ యుద్ధానికి వ్యతిరేకంగా గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జెఎన్వి.గోపాలన్, బి.వాసుదేవరావు, ఎపిఎంఎస్ఆర్యు నాయకులు శ్రీనివాస్, యుటిఎఫ్ మాజీ నాయకులు రామలింగరాజు పాల్గొన్నారు.

భారత ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలి

బి.బలరాం, పాలస్తీనా సంఘీభావ వేదిక నాయకులు

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి అత్యంత దుర్మార్గం. పాలస్తీనా హక్కులు, భూభాగం కోసం న్యాయ పోరాటం చేస్తుంది. అయితే ఇజ్రాయిల్ మాత్రం యుద్ధం పేరుతో అన్ని వ్యవస్థలు, రంగాలను నాశనం చేసి నరమేధం సృష్టిస్తోంది. దీనిని ప్రతిఒక్కరూ వ్యతిరేకించి పాలస్తీనాకు అండగా నిలబడాలి. ఇజ్రాయిల్కు అనుకూలంగా వ్యవహరిస్తున్న అమెరికాకు వత్తాసు పలుకుతున్న భారత ప్రభుత్వం వైఖరిని మార్చుకోవాలి. పాలస్తీనాకు మద్దతుగా 120 దేశాలు ఓటు వేస్తే భారత ప్రభుత్వం ఓటు వేయకపోవడం బాధాకరం. పాలస్తీనా సంఘీభావ వేదిక అనేది నిరంతరం పనిచేస్తుంది. 1967కు ముందున్న పాలస్తీనా ఏర్పడే వరకు ఆందోళన కొనసాగిస్తూనే ఉంటుంది. కుల, మతాలను పక్కనపెట్టి మనుషులంతా మానవత్వంతో స్పందించి ముందుకు రావాలి. భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలకు సిద్ధం కావాలి.

సదస్సు ఏర్పాటు అభినందనీయం

ఎస్కె.రబ్బాని, భీమవరం ముస్లిం కమిటీ అధ్యక్షులు



పాలస్తీనా గాజాలపై ఇజ్రాయిల్ విరుచుకు పడటం అత్యంత దుర్మార్గం. దీనిని అమెరికా వెనుక ఉండి నడిపించడం అత్యంత హేయం. భారత ప్రభుత్వం వత్తాసు పలకడం దారుణం. సమాజంలో ఉన్న వారంతా దీనిని ఖండించాలి. పాలస్తీనాపై జరుగుతున్న దుర్మార్గపు దాడిని అందరికీ తెలియజేసేలా పాలస్తీనా సంఘీభావ వేదిక సదస్సు ఏర్పాటు చేయడం అభినందనీయం.

ప్రజలంతా కలిసికట్టుగా ముందుకు సాగాలి

కరీముల్లా, వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్, భీమవరం

పాలస్తీనాపై ఇజ్రాయిల్ ఊచకోతకు దిగడం అత్యంత దారుణం. సమాజంలో ఇటువంటి యుద్ధాలను యావత్ ప్రపంచమంతా ఖండించాలి. కులమతాలకు అతీతంగా ప్రజలంతా కలిసికట్టుగా ముందుకు సాగాలి. ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తే ప్రశ్నించాలి. అప్పుడే హక్కులు సాధించుకోగలుగుతాం.

ఉద్యమాలకు ముస్లిం సోదరులు అండగా ఉంటాం

బాజ్జి, హిమ్దదండ్ కమిటీ సభ్యులు, భీమవరం

యుద్ధాల పేరుతో ప్రజల జీవితాలు విచ్ఛిన్నం చేయడం దారుణం. ఇటువంటి ఘటనలపై ప్రభుత్వాలను నిలదీయాలి. సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించే ఉద్యమాలకు ముస్లిం సోదరులు అండగా ఉంటాం. మళ్లీ ఇటువంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వానికి తెలియచెప్పేలా అంతా కలిసికట్టుగా ముందుకెళ్లాలి.

పీడిత ప్రజలకు న్యాయం చేయాలి

అజ్గారి, జమాతే ఇస్లామి హింద్ సభ్యులు, భీమవరం

ప్రభుత్వ విధానాలు, సంఘటనలు, దాడులు, దౌర్జన్యాలు బయటకు తెలియనీయకుండా జాతీయ మీడియా చేయడం సరైంది కాదు. సంఘీభావ వేదిక ద్వారా పాలస్తీనా విషయాలను ప్రజలకు తెలియజెప్పడం అభినందనీయం. 80 ఏళ్ల నుంచి ఇజ్రాయిల్ దుర్మార్గంగా వ్యవహరించడం దారుణం. పాలస్తీనాలో 90 శాతం భూభాగాన్ని యూదులు ఆక్రమించడం అన్యాయం. ఆర్థిక వనరులు, విద్య, వ్యాపార సామ్రాజ్యాలతో దాడులకు దిగి పాలస్తీనాను విచ్ఛినం చేశారు. పీడితుల పక్షాన నిలబడి వారికి న్యాయం జరిగే వరకూ ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలి.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని నిరసలు

తాడేపల్లిగూడెంలో నినదిస్తున్న నేతలు, ప్రజలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

భారత్ పాలస్తీనాకు మద్దతుగా నిలబడి, ఇజ్రాయిల్ అరాచక యుద్ధాన్ని ఆపాలని సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ నాయకులు కరెడ్ల రామకృష్ణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు అన్నారు. సిపిఎం పట్టణ కమిటీ, పాలస్తీనా సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం నుండి పోలీసు ఐల్యాండ్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిరసన కార్యక్రమం చేపట్టారు. పాలాస్తీనాపై యుద్ధం ఆపాలని, పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఖండించాలని, అమెరికన్ సామ్రాజ్యవాదం నశించాలి, ప్రపంచ శాంతి ముద్దు, యుద్ధం వద్దు అని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రధాని మోడీ ఇజ్రాయిల్ దాడికి సంఘీభావం తెలపడం దారుణమన్నారు ఇజ్రాయిల్ నరమేధాన్ని ఖండించాలని వారన్నారు. కార్యక్రమంలో సత్తి కోదండరామిరెడ్డి, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, అయినాల సత్యనారాయణ, చిట్టేటి సత్యనారాయణ, నర్మాల నారాయణరావు, పోతు శ్రీను, చిటికిన రాము, కాలపురెడ్డి కొండలరావు పాల్గొన్నారు.

వీరవాసరం: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలంటూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. స్థానిక బస్టాండ్ వద్ద తెలిపిన నిరసనలో సిపిఎం మండల కన్వీనర్ పోతుల మృత్యుంజయ మాట్లాడుతూ ఇజ్రాయిల్ అమెరికా అండ చూసుకుని పాలస్తీనా పౌరులపై నిరంకుశంగా దాడులు చేస్తుందన్నారు. ఐక్యరాజ్య సమితి హెచ్చరించిన ఇజ్రాయిల్ ప్రభుత్వంలో ఎటువంటి మార్పు రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలం విజయకుమార్, బొర్రా ఆలమహరాజు, యండమూరి సుబ్బారావు, పి.రంగరాజు, కె.అంజిబాబు, టివి.సతీష్ పాల్గొన్నారు.

పెనుమంట్ర: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దుర్మార్గ దాడి, నరమేధం ఆపాలని సిపిఎం ఆధ్వర్యాన పెనుమంట్రలో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ అమెరికా వత్తాసుతో స్కూల్స్, ఆసుపత్రులు, శరణార్థ శిబిరాలపైనా రాక్షస దాడులు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా నాయకులు షేక్ బాదుషా, సిపిఎం మండల కార్యదర్శి కె.సుబ్బరాజు, నేతలు వెంకటేశ్వరరావు, పరమేశు, టి.ఆంజనేయులు, బి.నాగేశ్వరరావు, బి.ఏడుకొండలు పాల్గొన్నారు.

పెంటపాడు: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని ఖండించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చిర్ల పుల్లారెడ్డి, బంకురు నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపవరపు రంగారావు, నేతలు మీసాల శ్రీనివాస్, పెనగంటి దుర్గా, తాడి బాలయ్య, కర్రి జనార్ధన్రెడ్డి, సత్తి సుబ్బిరెడ్డి, కర్రి అమ్మిరెడ్డి, భాషా, తిరపయ్య, సత్తి అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం చించినాడ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ప్రజాతంత్ర వాదులంతా వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాతిరెడ్డి జార్జి, మాసవరపు సుబ్బారావు, దేవా సుధాకర్, బొల్లా నరసింహమూర్తి, ఐద్వా నాయకులు సరిపల్లి జయప్రభ, జిల్లెళ్ల ప్రశాంతి, ఎం.ఆంజనేయులు, మురాల రాజేష్, తెన్నేటి శివాజీ పాల్గొన్నారు.

పెనుగొండ: పాలస్తీనాపై ఇజ్రాయిల్ నరమేధం ఆపాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక గాంధీ బొమ్మల సెంటర్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, నేత షేక్ పాదుషా మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మాదాసు నాగేశ్వరరావు, నాగిశెట్టి గంగారావు, ఆర్.వెంకటేష్, శీలం ఏసు తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను అరికట్టాలని సిపిఎం ఆధ్వర్యంలో ఆకివీడులో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో బొడ్డుపల్లి రాంబాబు, సందక సూరిబాబు, అప్పలనాయుడు, కార్మికులు పాల్గొన్నారు.

ముంపు శాశ్వత పరిష్కారానికి కృషి

రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

ముంపును పరిశీలిస్తున్న రాజశేఖర్

తాడేపల్లిగూడెం: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా మండలంలోని నందమూరు, ఆరుళ్ల, నవాబుపాలెం, జగన్నాధపురం, మాధవరం, అప్పారావుపేట ప్రాంతాల్లో ముంపునకుగురై దెబ్బ తిన్న పొలాలను మంగళవారం రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఏటా వరదలు, వర్షాల కారణంగా పెద్ద మొత్తంలో పంట నష్టపోతున్నామని, పంట పొలాలు ముంపునకు గురికాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపునకు గురై దెబ్బతిన్న పొలాలను పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. పంట నష్టం వివరాలను వెంటనే తయారుచేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందని, వివరాలు అందిన వెంటనే రైతులకు ఏ విధంగా పరిహారం అందించగలమో పరిశీలిస్తామన్నారు. పొలాలు ముంపుకు గురికాకుండా శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం మాధవరం - కంసాలపురం మధ్యలో కూలిపోయిన ఎర్రకాలువ బ్రిడ్జిని పరిశీలించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్, డిఆర్ఒ జె.ఉదయ భాస్కరరావు, ం ఇన్ఛార్జి ఆర్డిఒ బి.శివన్నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎంపిడిఒ కేసులో మరో ట్విస్టు..!

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఎంపిడిఒ వెంకట రమణరావు ఆత్మహత్య కేసులో మరో ట్విస్టు తెరపైకొచ్చింది. ఈ నెల 15న ఆయన అదృశ్యంపై కృష్ణా జిల్లా పెనుమలూరు పోలీస్స్టేషన్లో కేసు నమోదు చేశారు. ఎనిమిది రోజుల అనంతరం ఎంపిడిఒ ఈ నెల 23వ తేదీన ఏలూరు కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన మృతదేహం దొరకడంతో నిర్ధారణ అయిన సంగతి తెలిసిందే. న్యూడ్ వీడియో కాల్స్ గ్యాంగ్ బెదిరింపులకు ఎంపిడిఒ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పలు ఉత్తరాది రాష్ట్రాల అక్కౌంట్లకు ఎంపిడిఒ నగదు బదిలీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆ దిశగా పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఎంపిడిఒను బ్లాక్ మెయిల్ చేసిన నిందితుడిని ఎపి పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఎంపిడిఒ రమణారావు బ్లాక్ మెయిల్ చేసింది రాజస్థాన్ బర్కత్పురకు చెందిన వ్యక్తిగా గుర్తించి మూడు రోజుల క్రితం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం అనంతపురం జిల్లా సింగనమల పోలీసులు వేరే కేసులో సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఎంపిడిఒ కేసులో అతని ప్రమేయం ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆ సైబర్ నేరగాడిని కస్టడీకి తీసుకుని విచారణ చేపట్టాలని కృష్ణా జిల్లా పోలీసులు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ గ్యాంగ్లో 20 నుంచి 25 మంది ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఎపి పోలీసుల కదలికలు గుర్తించి వారంతా పరారైనట్లు తెలుస్తోంది. రమణ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి వారి బెదిరింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని ప్రచారం సాగుతోంది.

మా ఉపాధి పోగొట్టొద్దు

ఆటో యూనియన్ నేతల ధర్నా

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం ఎఎంసి కార్యాలయం నుంచి బైపాస్ రోడ్డులో జిల్లా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఉచిత బస్సు ప్రయాణంపై ప్రభుత్వం పునరాలోచన చేయాల్సిన అవసరం ఉందని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఇంటి సత్యనారాయణ అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్ల జీవితాలు అగమ్యగోచరంగా మారాయని, ఆటో డ్రైవర్ల సంఘాలన్నీ ఒక్క తాటిపైకి రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పంపన గోపి మాట్లాడుతూ 10 లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉచిత బస్సు ప్రయాణంలో నష్టపోతున్నారని, ప్రభుత్వం డ్రైవర్లకు ఉపాధి చూపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తలారి వాసు, సంజయరావు, సల్మాన్ రాజు, ఇర్రింకి సురేష్, వాసు, అరేపల్లి బాలాజీ, విప్పర్తి వెంకటరావు, నీతిపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సూర్యకాంతమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహిళా సంఘం నాయకులు

సూర్యకాంతం సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ గ్రామానికి చెందిన మాజీ ఎంఎల్‌ఎ రుద్రరాజు సత్యనారాయణ రాజు (అర్‌ఎస్) సతీమణి, మహిళా ఉద్యమ నేత రుద్రరాజు సూర్యకాంతం సేవలు చిరస్మరణీయమని ఐద్వా జిల్లా నాయకురాలు సరిపల్లి జయప్రభ అన్నారు. సూర్యకాంతం 9వ వర్ధంతిని చించినాడలో ఐద్వా మండల కార్యదర్శి జిల్లెళ్ల ప్రశాంతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జయప్రభ మాట్లాడుతూ ఒకపక్క పేదల కోసం అలుపెరగని పోరాటం చేస్తూనే ఆమె భర్త ఆర్‌ఎస్‌కు చేదోడు వాదోడుగా ఉంటూనే మరోపక్క ఐద్వా నిర్మాణానికి సూర్యకాంతమ్మ ఎంతో కృషి చేసేవారని తెలిపారు. ఉద్యమంలో పనిచేసే కార్యకర్తలను సొంత బిడ్డల్లా ఆదరించి అక్కున చేర్చుకుని వారిని ఆదరించేవారన్నారు. కార్యక్రమంలో కానేటి ప్రియాంక, చెట్టిమి నాగమణి, ముస్కుల జయశ్రీ, పల్లేరు సుబ్రమణ్యం, చెట్టిమి అనసూయ, చుట్టుగుల్ల సత్యవతి పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉల్లంపర్రు సబిత కాలేజీలో రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోటరీ 3020 అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్ విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రక్తం ఇవ్వడం ఆరోగ్యానికి చాలా మంచిదన్నారు. రక్తం దొరక్క ప్రతి రోజూ చనిపోయే వారు చాలామంది ఉంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 16 మంది రక్తదానం చేశారు. రొటేరియన్ మద్దుల శశికరణ్ గుప్తా 54వసారి రక్తదానం చేశారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్, క్లబ్ సభ్యులు జవ్వాజి కళ్యాణ్, బొల్లా శ్రీనివాస్ రక్తదానం చేశారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి జవాజ్ కళ్యాణ్, ట్రెజరర్ పోతబత్తుల సత్యనారాయణ, పాస్ట్ ప్రెసిడెంట్ మద్దాల రాంప్రసాద్, పెనుమాకు రామ్మోహన్‌రావు, కటరి నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థికి ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి - ఉండి

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రథమ ర్యాంకు సాధించిన ఆకేటి శైలజకు గొర్తి ఈశ్వర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఉషాబాలా పవన్‌కుమార్ రూ.పది వేల నగదు ప్రోత్సాహం మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో గొర్తి ఈశ్వర్ ట్రస్టు ప్రతినిధి పెనుమాక భానుమూర్తి మాట్లాడుతూ పదిలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా 28 పాఠశాలల్లో ఒక్కొక్కరికీ రూ.పది వేల చొప్పున నగదు బహుమతి అందజేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామలక్ష్మి మాట్లాడుతూ ఈశ్వర్ ట్రస్టు చేస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు శ్యామలరావు, పాఠశాల పూర్వ విద్యార్థి, ఆకివీడు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు పింఛన్ల పంపిణీ

నరసాపురం:ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు ఇంటి వద్దే పింఛన్ పంపిణీ చేస్తామని కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లబ్ధిదారులు పింఛన్ కోసం బ్యాంకుకు, సచివాలయాలకు వెళ్లొద్దని చెప్పారు. ఆగస్టు 1న ఉదయం 6 గంటల నుంచి మున్సిపాల్టీలో 1వ వార్డు నుంచి 15వ వార్డు సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్లు అందిస్తారని తెలిపారు.

జిఒ 85ను రద్దు చేయాలి

తాడేపల్లిగూడెం:ప్రభుత్వ వైద్యుల సర్వీస్ కోటాను తగ్గిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జిఒ 85ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ తాడేపల్లిగూడెం ప్రభుత్వ వైద్యుల సంఘం మంగళవారం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ సానుకూలంగా స్పందించారని, ఈ విషయాన్ని డిప్యూటీ సిఎం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఎంఎల్‌ఎ చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీహర్ష, వెంకటేష్, రూపాదేవి, పవన్, మౌనిక పాల్గొన్నారు.

పెనుమంట్ర : ప్రభుత్వ వైద్యుల పీజీ ప్రవేశం కోసం తెచ్చిన ఇన్ సర్వీస్ కోటాను తగ్గిస్తూ విడుదల చేసిన జిఒ 85 గురించి ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఎపి ప్రభుత్వ వైద్యుల సంఘం తరుపున పలువురు వైద్యాధికారులు కోరారు. మంగళవారం ఎంఎల్‌ఎ మంత్రి పితాని సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఎంఎల్‌ఎ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ వైద్యులు చేస్తున్న సేవలను కొనియాడారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

మహోన్నత నేత రామచంద్రరాజు

ఉండి:ఉండి నియోజకవర్గాన్ని టిడిపి కంచుకోటగా మలచిన మహోన్నత నాయకుడు కలిదిండి రామచంద్ర రాజు అని టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు అన్నారు. మాజీ మంత్రి కలిదిండి రామచంద్రరాజు 12వ వర్ధంతిని గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి ఆధ్వర్యంలో కలిదిండి రామచంద్రరాజు జన్మభూమి పార్కులో నిర్వహించారు. తొలుత రామచంద్రరాజు మనవరాలు అల్లూరి స్వాతి ఫణి వర్మ, మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు రామచంద్రరాజు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ హయాంలో లఘు పరిశ్రమల శాఖ మంత్రిగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలో విద్యుత్ శాఖా మంత్రిగా, టిటిడి ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరిమెరక శ్రీనివాస్, మల్లువలస రవీంద్ర, తక్కెళ్ళ నరేష్, సువారి వెంకన్న పాల్గొన్నారు.

మహిళా సాధికారత కోసమే మిషన్ శక్తి

పాలకొల్లు రూరల్ : ఐసిడిఎస్ ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో ఆగర్రు ఎంపియుపి స్కూల్ వద్ద మిషన్ శక్తి వందరోజుల అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎన్.మంగ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.గిరిబాబు, అంగన్వాడీ టీచర్ ఎం.దుర్గ భవానీ, సిహెచ్ బేబీ కుమారి పాల్గొన్నారు.

కాళ్ల : మిషన్ శక్తి మహిళల సాధికారత కోసమేనని ఐసిడిఎస్ కాళ్ల సెక్టార్ సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి అన్నారు. బొండాడ గ్రామంలో మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా మిషన్ స్కీమ్స్ గురించి మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల రక్షణ, విద్య, లింగ నిర్ధారణను నివారించేందుకే భేటీ బచావో, భేటీ పడావో పథకాన్ని కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

ఉండి : బాల్య వివాహాలు జరిపించినా, ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.మేరీ అన్నారు. మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా పడవల రేవులో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేరీ మాట్లాడారు. బాలికలకు కనీసం వయస్సు 18 సంవత్సరాలు నిండకుండా వివాహాలు చేయించినట్లయితే తల్లిదండ్రులకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీలు, ఆశాలు, మహిళా పోలీస్, విద్యార్థులు పాల్గొన్నారు.

నరసాపురం : ప్రభుత్వం అంగన్వాడీలకు అందించే పథకాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సుజాత రాణి అన్నారు. మంగళవారం మిషనశక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 12వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన అవగాహనా సదస్సుకు ఆమె అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సిడిపిఒ ఊర్మిళ, సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడాలి

పాలకొల్లు :స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి కళాశాలలో జల శక్తి అభియాన్ 2024-25లో భాగంగా గణితశాస్త్ర విభాగం వారు క్యాచ్ ది రైన్ అంశంపై వక్తృత్వ పోటీలను కళాశాల ప్రిన్సిపల్ రాజరాజేశ్వరి అధ్యక్షతన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు జల శక్తి అభియాన్ అంబాసిడర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడాలన్నారు. రసాయన శాస్త్ర అధ్యాపకుడు వంశీ సుబ్బరాయన్ మాట్లాడారు. అనంతరం పోటీలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో గణిత శాస్త్ర అధ్యాపకులు కె.శివకృష్ణ, బికెవి.రామలక్ష్మి పాల్గొన్నారు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఉపాధ్యాయ వృత్తిలో ఆత్మ సంతృప్తి

కాళ్ల ఎంఇఒ-2 గాదిరాజు కనకరాజు

నేడు ఉద్యోగ విరమణ

పెదఅమిరం నిర్మలా ఫంక్షన్ హాల్లో ఆత్మీయ అభినందన సభ

ప్రజాశక్తి - కాళ్ల

ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఆదర్శం. కాళ్ల ఎంఇఒ-2 గాదిరాజు కనకరాజు విద్యా ప్రదాతగా పేరొందారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన కనకరాజు తండ్రి డిఎన్ఆర్ కళాశాలలో నాన్ టీచింగ్‌లో ఉద్యోగిగా పని చేసే వారు. కనకరాజుకు చిన్నప్పటి నుంచి ఉపాధ్యాయ వృత్తి అంటే ఎంతో మక్కువ. ఆ ఇష్టమే ఆయనను ఉపాధ్యాయునిగా తీర్చిదిద్దింది. అందరిలాకాక కాస్త భిన్నంగా ఆలోచించి విద్యార్థుల ఉన్నతికి పాటుపడ్డారు. పలు పాఠశాలలకు ప్రహరీల నిర్మాణంతోపాటు సౌకర్యాల కల్పనకు ఆర్థిక సాయం సైతం అందించారు. ఉత్తమ బోధనతోపాటు పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీసే కార్యక్రమాలపై ఎక్కువగా ఆయన దృష్టి సారించేవారు. దీంతో విద్యార్థులు ప్రగతి బాటలో నడిచి వివిధ రంగాల్లో ప్రభుత్వ, ప్రయివేట్ ఉద్యోగులుగా పని చేస్తున్నారు. గత 35 సంవత్సరాల్లో ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారు. కనకరాజు ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా పెదఅమిరంలోని నిర్మలా ఫంక్షన్ హాల్లో ఆత్మీయ అభినందన సభ జరగనుంది.

కుటుంబ నేపథ్యం

పాలకోడేరు మండలం గొల్లలకోడేరుకు చెందిన సూరపరాజు, వెంకట సుబ్బాయమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. వారికి మూడో సంతానం కనకరాజు. 1962 జులై 7న జన్మించారు. కనకరాజు అన్నయ్య, అక్క, ఇద్దరు చెల్లెళ్లు కూడా ఉన్నత విద్య అభ్యసించారు. అన్నయ్య, అక్క ప్రధానోపాధ్యాయులుగా పని చేశారు. కనకరాజు విద్యాభ్యాసం భీమవరం డిఎన్ఆర్ విద్యా సంస్థలోనే



ఎంఇఒ గాదిరాజు కనకరాజు దంపతులు

ప్రాథమిక విద్య నుంచి బిఇడి వరకు సాగడం విశేషం. 1990లో ఉపాధ్యాయిని రాధారాణితో వివాహమైంది. వారి ఏకైక కుమారుడు సాయివర్మ 24 ఏళ్లకే మృతి చెందారు.

ఉద్యోగ ప్రస్థానం

1989లో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయునిగా ఎంపికై ఆకివీడు మండలం రాజులపేట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా చేరారు. యలమంచిలి మండలం మేడపాడు, పాలకోడేరు మండలం వేండ్ర అగ్రహారం, పాలకోడేరు చినపేట, విస్సాకోడేరు ప్రాథమిక పాఠశాలల్లో 13 ఏళ్లపాటు పనిచేశారు. స్కూల్ అసిస్టెంట్ గణితంగా ఉద్యోగోన్నతి పొందారు. బొండాడ హైస్కూల్లో 10 ఏళ్లు, మత్స్యపురి హైస్కూల్లో రెండేళ్లు, జువ్వలపాలెం హైస్కూల్లో ఎనిమిదేళ్లు, కోపల్లె హైస్కూల్లో రెండేళ్లు పని చేశారు. ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతిపై ఆకివీడు మండలం చెరుకుమిల్లి హైస్కూల్‌కు 2023 జూన్ 8 నుంచి 18వ తేదీ వరకు 11 రోజులు పని చేశారు. అనంతరం కాళ్ల మండల విద్యాశాఖాధికారి-2గా 2023 జూన్ 19 నుంచి పని చేస్తున్నారు. గత 35 సంవత్సరాల్లో ఎంతోమంది విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దారు.

సామాజిక సేవలో కనకరాజు

35 సంవత్సరాల సర్వీసులో కనకరాజు వద్ద చదివిన విద్యార్థుల్లో 12 మంది ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్లుగా, మరో 15 మంది విష్ణు కాలేజీలో ప్రొఫెసర్లుగా, ఇద్దరు ఎస్‌బిఐ మేనేజర్లుగా, 14 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా, ఇద్దరు ఇన్‌కంట్యాక్స్ అధికారులుగా, నలుగురు క్రికెట్ అంపైర్లుగా రాష్ట్రస్థాయిలో నలుగురు, వివిధ రంగాల్లో విద్యార్థులు ఉన్నత స్థితిలో ఉన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో ప్రాథమిక హైస్కూల్‌స్థాయి విద్యార్థులకు చదవడం, రాయడం, బేసిక్స్ మీద కాళ్ల మండలంలో అనేక పాఠశాలల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడంతో డివిజన్‌స్థాయిలో చదవడం, రాయడంలో ప్రథమ స్థానంలో నిలిచారు.

ఉపాధ్యాయ వృత్తిలో ఆత్మ సంతృప్తి

గాదిరాజు కనకరాజు, కాళ్ల ఎంఇఒ-2

ఉపాధ్యాయ వృత్తిని దైవంగా భావించి పని చేయడం ఎంతో ఆత్మ సంతృప్తినిచ్చింది. ఉద్యోగ విరమణ అనంతరం నా శేష జీవితాన్ని విద్యార్థుల మనసుల్లో మార్పు తీసుకు రావడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటా.

లైంగిక ఆలోచనలు రూపుమాపాలి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - వీరవాసరం

సమాజంలో లైంగిక దురాలోచనలను రూపుమాపినప్పుడే బాలికలకు, మహిళలకు రక్షణ ఏర్పడుతుందని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద పడాల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం స్వేచ్ఛ ఫర్ లిటిల్ బడ్స్ కార్యక్రమాన్ని ట్రస్ట్ జిల్లా ఇన్‌ఛార్జి ఆకుల మౌనిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్‌ఎ అంజిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ గుడ్, బ్యాడ్ టచ్‌ల కోసం మాట్లాడుకునే పరిస్థితులను రూపుమాపాలన్నారు. విద్యార్థినులు మంచి నడవడిక అలవాటు చేసుకోవడం ద్వారా ఎదుటవారి చెడు ఆలోచనలను దూరం పెట్టడానికి ఆస్కారం ఉంటుందన్నారు. బాలికలను వేధించే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించకూడదన్నారు. ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల వద్ద సమాజంలో జరుగుతున్న మంచి, చెడులను చర్చించాలన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు మాట్లాడుతూ బాలికలపై వేధింపుల గురించి పాఠశాలల్లో ప్రత్యేక క్లాసులు నిర్వహించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎంఎల్‌ఎను కోరారు. పడాల ట్రస్టు ప్రోగ్రాం మేనేజర్ ఎస్.రాజ్యలక్ష్మి మాట్లాడారు. అపరిచితులతో పరిచయాలు తగ్గించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌జెడి జి.నాగమణి, ప్రధానోపాధ్యాయుడు జుత్తిగ శ్రీనివాస్, వైస్ ఎంపిపిలు అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, చిలకపాటి ప్రకాశం, ఎంఇఒ శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

పశుపోషణకు ప్రాధాన్యతివ్వాలి

ప్రజాశక్తి - ఆచంట

గ్రామీణ ప్రాంతాల్లో రైతులు సాగు భూమితో పాటు పాడి పశువుల పోషణకు ప్రాధాన్యతివ్వాలని ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అన్నారు. మంగళవారం పోడూరు మండలం పండిత విల్లూరులో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంఎల్‌ఎ మాట్లాడారు. పశుసంపద పెంచుకోవాలని, ప్రస్తుత తరుణంలో పాడి రైతులు ఆసక్తి చూపడం లేదని అన్నారు. పశువుల్లో వచ్చే తెగుళ్లపై పశు వైద్యులు సూచనలు సలహాలు పాడి రైతులకు ఎప్పటికప్పుడు అందించాలన్నారు. పండిత విల్లూరులో పాడి రైతులు అధికంగా ఉండడాన్ని ఎంఎల్‌ఎ అభినందించారు. రైతులను అన్ని వ్యవస్థలూ లూటీ చేస్తున్నాయన్నారు. పోడూరు మండలంలో 50 గృహాలకు కనీసం రూపాయి కూడా బిల్లు చెల్లించలేదన్నారు. వాటన్నింటినీ కొత్త స్కీమ్‌లో పెట్టి వారికి గృహ నిర్మాణ బిల్లులు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఎడిఎ జికె జాన్సన్, కేశవ రెడ్డి, రైతు సంఘం నాయకుడు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ ఆరిమిల్లిని కలిసిన షరీఫ్

తణుకు:మాజీ శాసన మండలి ఛైర్మన్ ఎం.ఎ.షరీఫ్ మంగళవారం ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాధాకృష్ణ లేనిలోటు తణుకు ప్రజలు తెలుసుకుని మరలా అఖండ మెజార్టీతో గెలిపించారన్నారు. ముస్లిముల్లో పేదరికాన్ని తగ్గించేందుకు చంద్రబాబు ఎల్లప్పుడూ కృషి చేస్తారని అన్నారు. మరలా రాష్ట్రంలో సుపరిపాలన సాగుతుందని, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు.

అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలి

భీమవరం టౌన్:మహిళలు, పిల్లలు అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్త వహించాలని, తెలియని వ్యక్తులు ఇచ్చే తినుబండారాలు తీసుకోవద్దని భీమవరం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అడపాల ప్రసన్న కుమార్ అన్నారు. మంగళవారం ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా భీమవరం బలుసుమూడి 29వ సచివాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఉచిత న్యాయవాదులు పి.అంబేద్కర్, డి.రవికిరణ్, కె.జ్యోతి పాల్గొన్నారు.

నరసాపురం:నేడు ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాదికార సంస్థ ఆధ్వర్యంలో లిఖితపూడి గ్రామ సచివాలయం వద్ద న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చల్లా దానయ్య నాయుడు అధ్యక్షతన న్యాయ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దానయ్య నాయుడు మాట్లాడారు. ఇటీవల కాలంలో వేల మంది అక్రమ రవాణాకు గురవుతున్నారు. అక్రమ రవాణా తీవ్ర నేరమన్నారు. ప్రతి రోజూ వార్తల ద్వారా ప్రపంచంలో ఏదో ఒక మూల ట్రాపింగ్‌కు గురై హత్యలు జరిగినట్లు వింటున్నామని తెలిపారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు. దీన్ని నిరోధించడానికి గ్రామస్తుల మధ్య ఐక్యత కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది, లీగల్ సర్వీసెస్ సభ్యులు దేవేంద్ర, ఫణికర్, వై.సతీష్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ పాల్గొన్నారు.

నరసాపురం రైల్వేస్టేషన్ మాస్టార్‌గా మధుబాబు

నరసాపురం:నరసాపురం రైల్వే స్టేషన్ మాస్టార్‌గా మధుబాబు నియమిస్తూ దక్షణ మధ్య రైల్వే ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన భీమవరం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారు. గతంలో నరసాపురం రైల్వేస్టేషన్లో ఆయన ఐదేళ్ల పాటు ఎస్ఎంగా పని చేశారు. బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన దివాకర్ ఉద్యోగ విరమణ చేస్తుండడంతో ఆ స్థానంలో మధుబాబు రానున్నారు.

తహాశీల్దార్ రోహిణీదేవి బదిలీ

పెనుగొండ:ఎన్నికల నిమిత్తం పెనుగొండ తహాశీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తించిన రోహిణి దేవి కృష్ణాజిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం బదిలీపై వెళ్తున్న రోహిణి దేవికి తహాశీల్దార్ కార్యాలయం సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను వచ్చి కొద్ది కాలమైనా అందరూ తనకు సహకరించారని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహాశీల్దార్ మురళీమోహన్, పివి.రమణ, ఆర్ఐ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

'ఎంఆర్‌కె ఆస్తులకు రక్షణ కల్పించండి'

వీరవాసరం:వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ అస్తులకు రక్షణ కల్పించాలంటూ గ్రామస్తులు ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. నేడు కోట్లు విలువ చేసే హైస్కూల్ ఆస్తులను అప్పట్లో మద్దాల రామకృష్ణమ్మ వీరవాసరం విద్యాభివృద్ధికి దానం చేశారని తెలిపారు. నేటికీ సుమారు పదెకరాల మేరకు ఉన్న ఆట స్థలానికి ప్రహరీ నిర్మించలేదన్నారు. దీంతో ఆటస్థలం కొంత ఆక్రమణకు గురైందన్నారు. దీంతోపాటు హైస్కూల్ ఆవరణ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందన్నారు. పలుమార్లు ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు ప్రారంభించలేదన్నారు. తక్షణం ప్రహరీకి నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలంటూ గ్రామస్తులు గుళ్లిపల్లి కిరణ్, కడలి సాయిబాబు కోరగా, గ్రామంలో ఎంతోకాలంగా ఉన్న వీరవాసరంలో కొనసాగుతున్న ఆయుర్వేద వైద్యశాలను కొనసాగించాలని కోరుతూ కురెళ్ల నరసింహారావు, వేండ్ర దివాకర్, డివి సుబ్బారావు ఎంఎల్‌ఎకు వినతిపత్రం అందజేశారు.

వరద ప్రాంతాల్లో ఎంఎల్‌ఎ పర్యటన

ప్రజాశక్తి - ఉండి

ఇటీవల కురిసిన అధిక వర్షాల కారణంగా ముంపునకు గురైన యండగండి గ్రామంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలను నివారించడం ఎవరితరం కాదన్నారు. దాని వల్ల కలిగే నష్టాన్ని తగ్గించే ఏర్పాట్లు చేయడం తమ బాధ్యతన్నారు. వచ్చే రెండు నెలల్లో నియోజకవర్గంలోని మేజర్, మీడియం, మైనర్ డ్రెయిన్లను ప్రక్షాళన చేయించి పొలాలు ముంపునకు గురవ్వకుండా చూడాల్సిన బాధ్యత తనపై, అధికారుల పై ఉందన్నారు. అనంతరం ఇళ్లల్లోకి నీరు చేరిన బాధితులకు ప్రభుత్వం తరపున 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు పాల్గొన్నారు.

జ్వరాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - తణుకు

గ్రామాల్లో ప్రజలు వైరల్ జ్వరాల బారిన పడకుండా తక్షణం చర్యలు తీసుకోవాలని సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పది రోజులుగా విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గ్రామంలో ఖాళీ స్థలాలు, డ్రెయినేజీ లేని కొన్ని ప్రాంతాల్లో నీరు వెళ్లే మార్గం లేక మురుగు గుంటల్లో నిల్వ ఉండి దుర్వాసనతో పాటు విపరీతంగా దోమలు పెరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు టైఫాయిడ్ బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ వేలాది రూపాలయు వైద్యానికి ఖర్చు పెడుతు అప్పుల పాలవుతున్నారన్నారు. పారిశుధ్య పనులు మెరుగుపర్చి దోమల మందుతో పాటు, బ్లీచింగ్ చల్లించే చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో శాఖా కార్యదర్శులు వాసా వెంకటేశ్వరరావు, తిరునాథం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - ఉండి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు అన్నారు. మంగళవారం కొత్తపేటలోని ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న నాగరాజు మాట్లాడుతూ ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు సూచనల మేరకు టిడిపి నాయకులు మల్లువలస రవీంద్ర, సింగిడి వెంకన్న, కూన దుర్గారావు పాఠశాలకు మొక్కలు బహూకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి, పెద్దింటి బాబు, పాల్గొన్నారు.

ఆదాయపు పన్నుపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక ఎంఎంకెఎన్ఎం మున్సిపల్ హైస్కూల్లో మంగళవారం ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు, రిఫండ్‌పై అవగాహనా కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆదాయపు పన్ను అధికారి ఆర్ఎస్ఆర్.మూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేసే సమయం జులై 31వ తేదీ వరకూ ఉందని అందరూ సరైన ఆధారాలతో మాత్రమే డిడక్షన్స్ క్లైమ్ చేయాలని కోరారు.

మంత్రి సత్యప్రసాద్‌ను కలిసిన రాష్ట్ర బిసి నేతలు

ప్రజాశక్తి - పాలకోడేరు

రాష్ట్ర రెవెన్యూ స్టాంప్ రిజిస్ట్రేషన్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను తాడేపల్లిలో బుధవారం రాష్ట్ర బిసి సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టాదార్ పాస్ పుస్తకాలపై మాజీ ముఖ్యమంత్రి జగన్ బొమ్మను తొలగించి రాజముద్రతో పట్టాదారు పాస పుస్తకాలను జారీ చేసేందుకు చర్యలు తీసుకోవడం పట్ల మంత్రి సత్యప్రసాద్‌కు నేతలు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర బిసి సంఘం నేతలు వీరంకి రంగారావు, చేన మల్లు అశోక్, కామన రాంబాబు, కామన సుబ్బారావు, తాత శ్రీనివాసరావు, చెంచు రామయ్య, వాక రామ గోపాల్ ఉన్నారు.

మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బిసి సంఘం నేత కామన రాంబాబు

రసాబాసగా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - నరసాపురం

పురపాలక సంఘం అధికారుల పని తీరు ఏ టీషాపుల వద్దకు వెళ్లినా చెప్పుకుంటున్నారు. కొత్త ఇంటి పన్ను కావాలా అయితే రూ.5 వేలు ఇస్తే చాలు నేను ఇస్తా అంటూ పురపాలక పరువును కొందరు సిబ్బంది తీసేస్తున్నారంటూ వైసిపి కౌన్సిలర్ సఖినేటిపల్లి సురేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఛైర్‌పర్సన్ వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో అక్రమ కట్టడాలు, అధికారుల పనితీరుపై ప్రధానంగా చర్చ సాగింది. అధికారుల పరివేక్షణ లేకపోవడమే సిబ్బంది తీరుకు కారణమన్నారు. ఇంటి పన్ను వ్యవహారంపై మరోసారి ఇలాంటి తప్పిదాలు జరగకుండా కమిషనర్ వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలోని 26వ వార్డులో పురపాలక స్థలంలో ఓ పార్టీ అక్రమంగా దిమ్మలు కడుతున్నారంటూ దిలీప్ సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై టిడిపి కౌన్సిలర్ పాలూరి బాబ్జి, జనసేన కౌన్సిలర్లు సురేష్, సూర్యకుమారి, ఆరుణ, వైసిపి కౌన్సిలర్ వన్నెంరెడ్డి, స్వతంత్ర సభ్యులు కోటిపల్లి సురేష్లు అభ్యంతరం తెలిపారు. ముందు పట్టణంలో ఉన్న అక్రమ దిమ్మలతో పాటు కట్టడాలు తొలగించాలని డిమాండ్ చేశారు. వైసిపి కౌన్సిలర్లు దిలీప్, జయరాజు, రాజశేఖర్, కేసరి గంగరాజు మాట్లాడుతూ గతంలో జరిగినప్పుడు ఏం చేశారంటూ ప్రశ్నించారు. దీంతో వీరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఛైర్‌పర్సన్ వెంకటరమణ, కమిషనర్ జోక్యం చేసుకుని సర్వే చేసి చర్యలు తీసుకుంటామని సభ్యులకు నచ్చజెప్పారు.

ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

నేడు ఎస్ఆర్ దాట్ల వర్ధంతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రముఖ కమ్యూనిస్టు నేత ఎస్ఆర్.దాట్ల 45వ వర్ధంతి సభ బుధవారం నిర్వహిస్తున్నట్లు స్థానిక సిపిఎం నాయకులు తెలిపారు. బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు బ్రాహ్మణ చెరువు చిన్న వంతెన వద్ద నుంచి పెనుమంట్ర స్తూపం వరకూ ప్రదర్శన అనంతరం సభ జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ఎస్ఆర్ దాట్ల బంధువులు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.బలరాం, ముఖ్య నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ చెర్వులోని చింతపల్లి శ్రీరాములు స్మారక బస్ స్టాండ్ వద్ద ఉదయం నుండి మధ్యాహ్నం వరకూ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు.

నేడు బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు ఈ నెల 31వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది నల్లమిల్లి జోసెఫ్ తెలిపారు. నూతన కార్యవర్గంలో ఇప్పటికే 10 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయని తెలిపారు. అధ్యక్ష పదవికి చేగొండి శ్రీరంగ రామ్మోహన్ బాలాజీ, గన్నాబత్తుల మత్స్య వల్లభరావు, ప్రధాన కార్యదర్శి పదవికి రొక్కాల గ్లాడ్ స్టన్ కుమార్, రంపా పుల్లాజీ, గ్రంథాలయ కార్యదర్శి పదవికి కె.అమరేశ్వరరావు, నారిన శ్రీనివాసరావు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శి పదవికి మేడిది శ్రీమంత్, కొప్పినీడి చిట్టి పద్మజ, మహిళా ప్రతినిధి పదవికి బొడ్డు ప్రగతి, రొక్కాల జెస్సికళ పోటీలో నిలిచారన్నారు.

ఇన్‌ఛార్జి తహాశీల్దార్‌గా సీతారత్నం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఇన్‌ఛార్జి తహాశీల్దార్‌గా బెజవాడ సీతారత్నం మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల నిమిత్తం ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన ప్రసాద్ కోనసీమ జిల్లాకు బదిలీపై వెళ్లారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన సీతారాత్నంను సిబ్బంది, విఆర్ఒలు అభినందించారు. బదిలీ అయిన తహాశీల్దార్ ప్రసాద్‌ను రెవెన్యూ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.

ఘనంగా జాతీయకరణ దినోత్సవం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించాలంటే ప్రాధాన్యత కలిగిన దినోత్సవాలను వారోత్సవాలు, పక్షోత్సవాలుగా నిర్వహిస్తే ఫలితం ఉంటుందని సిఎస్ఎన్ కళాశాల కార్యదర్శి డాక్టర్ చీడే సత్యనారాయణ అన్నారు. మంగళవారం సిఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో శ్రీవిజ్ఞానవేదిక, కళాశాల ఆధ్వర్యంలో బ్యాంకుల జాతీయకరణ దినోత్సవ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సకుమల్ల సత్యనారాయణ, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. వారంరోజులపాటు నిర్వహించిన పోటీల్లో 122 మంది పాల్గొన్నారని, వీరందరికీ ప్రశంసా పత్రాలను అందించామని తెలిపారు.

ఇళ్ల వద్దకే పింఛన్లు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పురపాలక సంఘం పరిధిలో ఒకటి నుంచి 14 వార్డు సచివాలయాల పరిధిలోని 31 వార్డుల్లో పింఛన్లు ఆగస్టు 1వ తేదీన ఇంటింటికీ పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ విజయ సారధి తెలిపారు. ప్రజలు సచివాలయాలు, మున్సిపల్ కార్యాలయం వద్దకు రాకూడదన్నారు.

3 నుంచి జిల్లాస్థాయి పోటీలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

78వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆయా కళాశాలలు, పాఠశాలల్లో జిల్లాస్థాయి పోటీలను నిర్వహిస్తున్నామని, ఈ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పక్షోత్సవాలుగా నిర్వహిస్తున్నామని ఉమెన్ అండ్ ఛైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ జిల్లా ఛైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఆర్.రాజేష్, ప్రోగ్రాం కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తెలిపారు. మంగళవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పిఎస్ఎం గర్ల్స్ హైస్కూల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకల జిల్లాస్థాయి పోటీలకు పిలుపునిచ్చేందుకు కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆగస్టు 3 నుంచి 9వ తేదీన వరకూ జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆగస్టు 17న క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకుని గెలుపొందిన వారికి బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, హైస్కూల్ హెచ్ఎం వారణాసి రాధాకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONBLE I-ADDL JUNIOR CIVIL JUDGE, ELURU, W.G.Dt.

I.A.No.218/2016 in O.S.No.231/2016

Between:
Pulavarthi Deva Raju and another ...Petitioners/ Plaintiffs
And
Ventrapati Rambabu and 4 Others ...Respondents/Defendants

R5 : Byvarapu Veeamma, w/o.veerraju, Hindu, Female, Aged 40 Yrs, R/o.Kavvagunta Village, Eluru (M), W.G.Dt.

మీరు పైన తెలిపిన I.A.No.218/2016 లోను O.S.No.231/2016 లోను మీకు 5వ ప్రతివాది అయియున్నారు. మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. పైన తెలిపిన Hon'ble Ist Addl. Junior Civil Judge, Eluru కోర్టు వారి ఉత్తరువు ప్రకారం మీరు ఆగస్టు 16వ తేదీ 2024వ సంగరం ఉదయం 10.30 నిలకు హాజరు కావలెను. లేని యెడల సదరు విషయమై మీకు పరోక్షముగా విచారించి తీర్మానము చేయబడునని ఇందుమూలముగా తెలియచేయడమైనది. (శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం వాయిదా తేది. 16-8-2024)

Tumeti Ganga Raju, Advocate, Eluru. Cell: 6301538696